రహదారి నిర్మాణానికి వీడని గ్రహణం

ఆ మార్గం దాదాపు పదిహేరు ఊళ్లను పెందుర్తి నుంచి అడవివరం/సింహచలంకు దగ్గర చేస్తుంది. జంగాలపాలెం, నరిపల్లి, ముదపాక, గుర్రంపాలెం, బొడ్డునాయుడుపాలెం, అక్కిరెడ్డిపాలెం, పీఎస్ఎల్, రాయవరపువానిపాలెం తదితర గ్రామాల నుంచి సింహచలం రోడ్డుకు నిమిషాల్లో చేరుకునే దగ్గర మార్గం. వేలాది మంది రాకపోకలు సాగించే ఆ మార్గమే పెందుర్తి–జుత్తాడ రహదారి. కానీ, ఛిద్రమైన ఈ రోడ్డు నిర్మాణానికి పట్టిన గ్రహణం మాత్రం ఇంకా వీడటం లేదు.


వాలిమెరక జుత్తాడ సమీపంలో అధ్వానంగా ఉన్న అక్కిరెడ్డిపాలెం–జుత్తాడ రహదారి


అక్కిరెడ్డిపాలెం సమీపంలో కోతకు గురైన రోడ్డు

- పూర్తిగా శిథిలావస్థకు చేరిన అక్కిరెడ్డిపాలెం–జుత్తాడ రహదారి
- దారి పొడవునా గోతులు, రాళ్లు
- గత ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు విడుదల
- సాంకేతిక కారణాలు, ఎన్నికల కోడ్‌తో నిలిచిన టెండర్
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు
- త్వరగా పనులు ప్రారంభించాలని కోరుతున్న ప్రజలు

పెందుర్తి: పెందుర్తి–అక్కిరెడ్డిపాలెం–జుత్తాడ–అడవివరం రహదారి అధ్వానంగా ఉంది. వేలమందికి ఎంతో ఉపయోగకరమైన ఈ రోడ్డు పరిస్థితిని తెలుసుకున్న గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దీని నిర్మాణానికి రూ.3 కోట్లు నిధులు కేటాయించింది. వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌లో 80 అడుగుల రోడ్డు ప్రతిపాదన ఉన్నప్పటికీ అప్పట్లో 30 అడుగుల రోడ్డు నిర్మాణానికి ఆ నిధులు విడుదల అయ్యాయి. కానీ కొన్ని సాంకేతిక కారణాలు, తరువాత ఎన్నికలు రావడంతో టెండర్ దశలోనే నిలిచిపోయింది. కాగా తాజాగా కురిసిన భారీ వర్షాలతో ఈ రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఏడాదిన్నర దాటినా కూటమి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఈ రోడ్డు నిర్మాణంపై కనీసం స్పందించడం లేదు.

వేలాది మందికి ఉపయోగం

పెందుర్తి–ఆనందపురం ప్రధాన రహదారి నుంచి అక్కిరెడ్డిపాలెం కూడలి నుంచి జుత్తాడ, దువ్వపాలెం మీదుగా ఈ రోడ్డు అడవివరానికి కలుస్తుంది. పై గ్రామాలకు చెందిన వేలాది మంది ప్రజలు మండల కేంద్రం పెందుర్తికి ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. అత్యవసర వైద్యం అవసరమైనప్పుడు ఆయా ప్రాంతాల ప్రజలు ఆరిలోవ మెడికల్ హబ్‌కు చేరుకోవాలంటే ఈ మార్గం ద్వారా ఎంతో సమయం కలిసివస్తుంది. ఆయా ప్రాంతాల వాసులు నగర శివారు మధురవాడ, హనుమంతువాక ప్రాంతాలతో పాటు ఎంవీపీ, ఇసుకతోట చేరుకోవాలంటే ఈ మార్గంలో ప్రయాణం సులభంగా ఉంటుంది.

దారి పొడవునా గోతులే..

అయితే పుష్కరకాలంగా ఈ రహదారి అభివృద్ధికి నోచుకోలేదు. వర్షాలతో పాటు క్వారీ లారీలు కూడా తరచూ తిరగడంతో రోడ్డు పూర్తిగా పాడైంది. కాగా తాజాగా కురిసిన వర్షాలతో ప్రస్తుతం ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనాలు కూడా రాకపోకలు సాగించే పరిస్థితి లేదు. రహదారిపై అడుగుకో గొయ్యి దర్శనమిస్తోంది. రోడ్డు శిథిలమై రాళ్లు తేలాయి. రోడ్డు అంచులు కోతకు గురయ్యాయి. గోతుల్లో నీరు చేరి పూర్తిగా బురదమయం అయింది. ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటే నరకం చూస్తున్నామని వాహనచోదకుడు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి రోడ్డును బాగుచేయాలని కోరుతున్నారు.


అక్కిరెడ్డిపాలెం కూడలి సమీపంలో పూర్తిగా శిథిలమైన రోడ్డు


వర్షాలకు ఇటీవల చెరువును తలపిస్తున్న దువ్వపాలెం సమీపంలోని రోడ్డు (ఫైల్)

అత్యవసర సమయంలో ఎంతో ఉపయోగం



నిత్యం మా ఊరి మీదుగా వేలాది మంది సింహచలం, ఆరిలోవ ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. వైద్యం కోసం ఆరిలోవ ఆస్పత్రులకు అత్యవసర సమయంలో వెళ్లేవారికి ఈ రోడ్డు ఎంతో ఉపయోగం. అయితే ఏదైనా భారీ వాహనం వస్తే, ఎదురుగా ఉన్న బైక్ కూడా తప్పుకోలేని పరిస్థితి. రోడ్డు కూడా పూర్తిగా పాడవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. ఈ రోడ్డు బాగుపడితే దూరం తగ్గి, మాకు వ్యయప్రయాసలు కూడా తగ్గుతాయి. అధికారులు చొరవ తీసుకుని రోడ్డు బాగుచేయాలి.

– ఉగ్గిన నాగార్జున, జుత్తాడ

వాహనాలు పాడవుతున్నాయి



ఈ రోడ్డులో నిత్యం ఆటో నడుపుతుంటాను. ఒక్కోసారి రోజుకు నాలుగైదు సార్లు తిరగాల్సి ఉంటుంది. కానీ ఈ రోడ్డులో ప్రయాణం చాలా ఇబ్బందిగా ఉంది. వాహనాలు పాడవుతున్నాయి. రోడ్డు కోతకు గురవడంతో ఎదురుగా పెద్ద వాహనాలు వస్తే తప్పించడం కష్టమవుతోంది. ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– గంధ్రెడ్డి రమణ, ఆటో డ్రైవర్

ప్రజాప్రతినిధులు స్పందించాలి



గత ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. టెండర్ ప్రక్రియ కొలిక్కి వచ్చేసరికి సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది. తరువాత మళ్లీ టెండర్ వేసే సమయానికి ఎన్నికలు వచ్చాయి. దీంతో ఆయా నిధుల వినియోగం జరగలేదు. ఈ రోడ్డు పరిస్థితిని ఇటీవలే ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు దృష్టికి తీసుకువెళ్లాం. ఆయన అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణంపై దృష్టి సారిస్తామన్నారు. వారు త్వరగా స్పందించి, రోడ్డు నిర్మాణం పూర్తయితే మా ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరం.

– బొడ్డు సూర్యప్రకాష్, సీనియర్ నాయకుడు, జుత్తాడ

క్లుప్తంగా

విద్యార్థులకు మోడల్ పేపర్స్ అందజేత


దాత ప్రసాద్ అందజేసిన మెటీరియల్‌తో విద్యార్థులు

పరవాడ: స్థానిక జెడ్పీ పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్‌కు ఉపయోగపడే మోడల్ పేపర్ బుక్స్‌ను విశాఖ స్టీల్ సిటీ లయన్స్‌క్లబ్ కార్యదర్శి ఎల్.వి.ప్రసాద్ మంగళవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ తన తండ్రి, దేశపాత్రునిపాలెం గ్రామానికి చెందిన దివంగత లక్కరాజు రాము నాయుడు జ్ఞాపకార్థం అందజేసిన రూ.9వేల విలువ చేసే ఈ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా సెకండ్ విడిజి లయన్ శ్రీనివాసరావు, ఎండీ 316 జీఎంటీ లయన్ డి.ఎస్.ఎస్.వర్మ, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ మంత్రి జగన్నాథరావు, పాఠశాల హెచ్ఎం రమణ మూర్తి పాల్గొన్నారు.

పశువైద్య కేంద్రాల్లో సమస్యల పరిష్కారానికి కృషి


భర్నికంలో శిబిరాన్ని పరిశీలిస్తున్న పశుసంవర్ధకశాఖ డీడీ చంద్రశేఖర్

పరవాడ: పశువైద్య కేంద్రాల్లో సిబ్బంది కొరతను నివారించడానికి చర్యలు తీసుకుంటామని పశు సంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మోపాడ చంద్రశేఖర్ అన్నారు. వాడచీపురుపల్లి, రావాడ, భర్నికం గ్రామాల్లో అమలు జరుగుతున్న గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వాడచీపురుపల్లి పశు వైద్యశాలలో సిబ్బంది కొరతను గుర్తించామని, త్వరలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం రావాడ రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలపై పరవాడ పశుసంవర్థక శాఖ ఏడీ రామకృష్ణ కీర్తికి సూచనలిచ్చారు. ఆయన వెంట వాడచీపురుపల్లి పశువైద్యులు డాక్టర్ సురేష్‌కుమార్, సిబ్బంది కల్యాణి, లక్ష్మణ్, భాస్కర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనర్ జాన్ ప్రశాంత్

సబ్బవరం: బీఎల్‌వోల విధులపై సబ్బవరం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీఎల్‌వో యాప్, ఫారం ప్రాసెసింగ్, భారత ఎన్నికల కమిషన్ గైడ్‌లైన్స్‌పై ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అర్జునరావు అవగాహన కల్పించారు. బీఎల్‌వో ఫీల్డ్ ఎంక్వైరీ, క్లెయిమ్ డిస్పోజ్ విధానంపై చర్చించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బీఎల్‌వో యాప్‌నందు ఫారం–6,7,8లను ఏరోజుకారోజు ఫీల్డ్ ఎంక్వైరీ చేసి, ఏఈఆర్‌వో లాగిన్‌కు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకులు శివప్రసాద్, మాస్టర్ ట్రైనర్ వి.జాన్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

సబ్బవరం: ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సబ్బవరం సెక్షన్–1 కార్యాలయంలో బుధవారం నిర్వహించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ, సీజీఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్మన్, రిటైర్డ్ జడ్జి డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యురాలు బి.సురేఖ, సభ్యులు మురళీకృష్ణ, సుబ్బారావు హాజరవుతారని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, వేదపండితులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమ్మె కరపత్రం విడుదల


సమ్మె కరపత్రాన్ని విడుదల చేస్తున్న సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి, తదితరులు

పరవాడ: విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను సంస్థలో విలీనం చేసి, వారి సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ నెల 15 నుంచి కార్మికులు చేయనున్న సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఫార్మాసిటీలో సబ్‌స్టేషన్ వద్ద సమ్మె కరపత్రాన్ని మంగళవారం విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఒకే క్యాడర్, ఒకే వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. 22వ పీఆర్సీ ఎరియర్స్, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న నాన్ రెగ్యులర్ ఉద్యోగులు అందరికీ అన్‌లిమిటెడ్ వైద్య సౌకర్యం, కోటి రూపాయల ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.10 లక్షలు చెల్లించాలని కోరారు. జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంలో ప్రైవేటీకరణ విధానాలను ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎ.చంద్రశేఖర్, పి.అప్పారావు, బి.నరసింగరావు, ఎం.రమణారావు, కె.త్రినాథ్, జయరాజ్ పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే జీవితాలు నాశనం


మాట్లాడుతున్న క్రైం విభాగం సీఐ చంద్రమౌళి

పెందుర్తి: తెలిసో, తెలియకో నేరాల్లో భాగస్వాములు అయితే వారి జీవితాలు దాదాపు ముగిసిపోయినట్లే అని వెస్ట్ సబ్ డివిజన్ క్రైం విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.చంద్రమౌళి అన్నారు. నేరాలను అరికట్టేందుకు విద్యార్థి దశ నుంచే చొరవ తీసుకోవాలని సూచించారు. 88వ వార్డు సతివానిపాలెంలోని సీతారామగార్డెన్స్, ఎస్‌టీబీఎల్ కమ్యూనిటీల్లో మంగళవారం పెందుర్తి క్రైం విభాగం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ ఇటీవల అనేక మంది మైనర్లు చోరీలు, ఇతర అసాంఘిక కార్యకలాపాల్లో పాలుపంచుకోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర వహిస్తాయి కనుక అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో తప్పనిసరిగా అమర్చుకోవాలని సూచించారు. క్రైం ఎస్ఐ సూరిబాబు,అపార్ట్‌మెంట్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

వెంకటాద్రిపై ప్రత్యేక పూజలు


నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

పెందుర్తి: చాతుర్మాస దీక్షల్లో భాగంగా స్థానిక వెంకటాద్రిపై మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో సుందరకాండ హవనం చేశారు. అనంతరం శ్రీనివాస నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. ముందుగా భక్తులు తులాభారం నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.


సీజేఐపై దాడి హేయం



సీజేఐ గవాయ్‌పై దాడికి నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: దేశ అత్యున్నత న్యాయస్థానం చీఫ్ జస్టిస్ గవాయ్‌పై మతోన్మాది దాడి హేయమైందని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. ఘటనకు పాల్పడిన మతోన్మాదిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సీజేఐపై దాడికి నిరసనగా లంకెలపాలెం కూడలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. మతోన్మాదుల ప్రభావంతోనే రాజేష్ లాంటి వారు పెట్రేగిపోతున్నారన్నారు. దళితులు, గిరిజనులు, మైనారిటీలపై ప్రత్యక్షంగా పరోక్షంగా దాడి చేయడంతో పాటు వారి హక్కులను హరిస్తున్నారన్నారు. దేశాన్ని సనాతన ధర్మం పేరుతో మతోన్మాదులు నాశనం చేస్తున్నారని ఆరోపించారు. ఈ దుర్మార్గాలను ఎదిరిస్తున్న వారిపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఈ దాడిని రాజ్యాంగంపై దాడిగానే పరిగణిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.వెంకటరావు, పెంటారావు, రమణ, సత్తిబాబు, సూరిబాబు, అప్పారావు పాల్గొన్నారు.

ఏయూలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ప్రారంభం


అంతరిక్ష వారోత్సవాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం జియో–ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. 'ఉర్వీకృతి' విద్యార్థి విభాగం, ఇండియన్ సొసైటీ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఏయూ ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అంతరిక్షంలో పెరుగుతున్న వ్యర్థాలకు పరిష్కారం కనుగొనాలని విద్యార్థులకు సూచించారు. విభాగాధిపతి ప్రొఫెసర్ పి. జగదీశ్వర రావు ఇస్రో కార్యకలాపాలపై, ఆచార్యులు డి.లలిత భాస్కర్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అంతరిక్ష సమాచార సాంకేతికతపై ఉపన్యాసాలు ఇచ్చారు.

ఎయిర్‌పోర్టు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి


ఎయిర్ పోర్టు పర్యావరణ కమిటీ సమావేశంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పలు శాఖల అధికారులు

మహారాణిపేట: విశాఖ ఎయిర్‌పోర్టు పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. డ్రెయిన్ల ద్వారా మురుగునీరు, వర్షపు నీరు సాఫీగా పోయేలా చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన ఎయిర్‌పోర్టు పర్యావరణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పోర్టు ట్రక్ పార్కింగ్ ప్రాంతంలో లారీ డ్రైవర్లు పారబోస్తున్న ఆహార పదార్థాల కారణంగా పక్షులు చేరి విమాన రాకపోకలకు ప్రమాదం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మేహాద్రిగెడ్డ, ఇతర గెడ్డ ప్రాంతాల్లో పూడిక, చెత్తను క్రమం తప్పకుండా తొలగించాలని ఆదేశించారు. ఎయిర్‌పోర్టు పరిసరాల్లో నిర్మాణ సామగ్రి, చెత్తాచెదారం డంప్ చేయకుండా ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలన్నారు. ఎయిర్‌పోర్టు అథారిటీ, విశాఖపట్నం పోర్టు, ఐఎన్ఎస్ డేగా, జీవీఎంసీ, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన


రామారావును సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో స్కాలర్‌షిప్, జీఎస్టీపై మంగళవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు విద్యార్థులకు ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రిన్సిపాల్ ఎస్‌ఈ ఫ్లోరా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూడీవో ఆర్.శ్యామల, కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలాస్, సిబ్బంది పాల్గొన్నారు.

పునరావాస కేంద్రంలో యువకుడికి ఆశ్రయం

పెందుర్తి: మత్తుకు బానిసై, జీవితాన్ని నాశనం చేసుకుంటున్న ఓ యువకుడికి పెందుర్తి పోలీసులు ఓ పునరావాస కేంద్రంలో ఆశ్రయం కల్పించారు. వివరాలివి.. పెందుర్తి ప్రాంతానికి చెందిన ఓ యువకుడు గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసయ్యాడు. దీనిపై కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించి, అతడిని మార్చేందుకు ప్రయత్నం చేయాలని కోరారు. వెంటనే స్పందించిన సీఐ కె.వి సతీష్‌కుమార్ ఆ యువకుడికి ఆశ్రయం కల్పించాలని సిబ్బందికి సూచించారు. సీఐ సూచనల మేరకు పెందుర్తిలోని న్యూ లైఫ్ రీహాబిలిటేషన్ కేంద్రంలో పోలీసులు మంగళవారం చేర్పించారు.

సీపీఆర్‌పై అందరికీ అవగాహన అవసరం


సీపీఆర్‌పై విద్యార్థులకు వివరిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: విశాఖపట్నంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా డాక్టర్ వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీపీఆర్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వలంటీర్లు సీపీఆర్ అత్యవసర దశల ప్రాముఖ్యతను అర్థం చేసుకోవాలని సూచించారు. ఐఆర్సీఎస్ చైర్మన్ సి.బాల సతీష్ మాట్లాడుతూ రోగి ప్రాణాలు కాపాడడంలో సీపీఆర్ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు, ప్రజలకు సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్‌ను ఆయన ప్రశంసించారు. ట్రైనర్ డాక్టర్ పి.రామారావు ప్రత్యక్షంగా సీపీఆర్ చేసి చూపించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ కె.రవిబాబు, ఎన్ఎస్ఎస్ జోనల్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.ఉమామహేశ్వరరావు, జి.వి.ప్రతాప్, బి.లక్ష్మి, ఎస్.వి.రామారావు, టి.రామకృష్ణ, సీహెచ్. సాయికృష్ణ పాల్గొన్నారు.

పెందుర్తి రైల్వే స్టేషన్‌లో 6.8 కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరి అరెస్ట్


నిందితులు, గంజాయితో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సిబ్బంది

పెందుర్తి: ఏవోబీ ప్రాంతం నుంచి రైల్లో ఇతర ప్రాంతాలకు గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. వారి నుంచి రూ.40 వేలు విలువైన 6.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి.. ప్రకాశం జిల్లాకు చెందిన కువ్వవరపు వినీల్‌కుమార్, షేక్ సలీ రైల్లో పెందుర్తి రైల్వే స్టేషన్ వరకు గంజాయిని తీసుకువచ్చారు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు సిబ్బంది మాటు వేసి వారిని పట్టుకున్నారు. అనంతరం పెందుర్తి ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. దాడిలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎస్ఐలు ఎస్.శ్రీనివాస్, సీహెచ్ రాజేశ్వరి, ఎల్.అరుణకుమారి, పి.అప్పారావు, హెచ్‌సీ కె.వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

108 వాహనాల్లో ఐఎఫ్‌టీ సేవలపై సమీక్ష


108 వాహనంలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా మేనేజర్ సురేష్

మహారాణిపేట: అత్యవసర సమయంలో రోగుల్ని, క్షతగాత్రుల్ని ఆస్పత్రులకు చేర్చే 108 వాహనాల సేవలు కొన్నిసార్లు తమకు అందట్లేదని ప్రజల ఆరోపణ. ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి ప్రధాన ఆస్పత్రులకు రిఫరల్ కేసులు రానురాను అధికమవుతుండటం వల్లే ఈ జాప్యం నెలకొంటోందని 108 సిబ్బంది వాదన. హైరిస్క్ కేసుల్ని మాత్రమే ఇలా తరలించాల్సి (ఐఎఫ్‌టీ) ఉన్నా కొన్ని సార్లు రోగుల ఒత్తిళ్లతో చిన్న చిన్న కేసుల తరలింపునకూ 108 అంబులెన్స్‌ల్ని వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు సూచనల మేరకు 108 వాహన వ్యవస్థ జిల్లా మేనేజర్ ఎం.సురేష్‌కుమార్, పైలెట్లు, ఈఎంటీలు మంగళవారం గోపాలపట్నం సీహెచ్‌సీకి వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాతతో 108 జిల్లా మేనేజర్ సురేష్‌కుమార్ పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆయా వాహనాల పరిస్థితిని సురేష్ పరిశీలించారు. డాక్టర్ సుజాత సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో 108 వ్యవస్థ ఆపరేషనల్ ఎగ్జిక్యూటివ్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమ్మెకు సిటు మద్దతు

దాబాగార్డెన్స్: విద్యుత్ సంస్థలో పని చేస్తున్న పర్మినెంట్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పీస్‌రేట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 15 నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మె విజయవంతం చేయాలని సిటు విశాఖ జిల్లా కమిటీ విద్యుత్ కార్మికులకు విజ్ఞప్తి చేస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గత ఏడాదిగా అనేక దఫాలుగా ఈపీడీసీఎల్ పరిధిలో సీఎండీకి వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. చలో విద్యుత్ సౌధ కార్యక్రమాలు చేపట్టామన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ యాజమాన్యం సమస్యలు పరిష్కరించకుండా కార్మికులు సమ్మెకు వెళ్లేలా చేస్తున్నాయని తెలిపారు. సమ్మె వల్ల ప్రజలకు జరిగే నష్టాన్ని నివారించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. తక్షణమే కాంట్రాక్ట్ కార్మి కుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఒత్తిడిని జయిస్తే ఆనందకర జీవితం


డాక్టర్ కిషోర్‌బాబును సత్కరిస్తున్న ప్రతినిధులు

సీతంపేట: దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ అనేక రకాల సమస్యలతో విపరీతమైన ఒత్తిడికి గురవుతున్నారని ప్రముఖ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ కిషోర్‌బాబు అన్నారు. నేషనల్ హెచ్‌ఆర్‌డీ నెట్‌వర్క్ విశాఖపట్నం చాప్టర్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో 'ఒత్తిడిని జయించే విధానం' పై మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. నిజజీవితంలో ఎన్ని సమస్యలు ఎదురైనా వాటిని తేలికగా తీసుకోవాలన్నారు. చక్కని ప్రణాళికలతో స్థిరత్వంతో జీవిస్తూ మానసికంగా దృఢత్వాన్ని పెంచుకోవాలని సూచించారు. అప్పుడే ఒత్తిడికి గురికాకుండా ఆరోగ్యవంతమైన జీవితంతో ఆనందంగా జీవించవచ్చన్నారు. పారిశ్రామిక సంస్థల్లో పనిచేసే వారందరూ ఒత్తిడికి గురికాకుండా జాగ్రత్త వహించాలన్నారు. చాప్టర్ ప్రెసిడెంట్ కె.వి.రావు, ఆచార్య సాంబశివరావు, శేషగిరిరావు, పి.భాస్కర్, శ్రీనివాస్, ఆర్.సుధాకర్, శ్రీరాములు, కృష్ణకుమార్, శివప్రసాద్, ఎస్‌వీఎస్ సుధాకర్ పాల్గొని డాక్టర్ కిషోర్‌బాబును సత్కరించారు.